PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 105 | 26 ఆదివారం జూలై 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256

## నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

- మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య




న్యూఢిల్లీ,జూలై25(ప్రజా సీమ)

:దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది.నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

## కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్


# రాజీనామా..!

- కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?
- నీట్ ఆందోళనతో దిగివచ్చిన ప్రధాన్
- దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదనే నిర్ణయం



న్యూఢిల్లీ,జూలై25(ప్రజా సీమ):

"నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్రమోడీకి పంపారు. యువత, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలకు కేంద్ర మంత్రి దిగొచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన రాజీనామా లేఖలో ఆయన మాట్లాడుతూ.. గత నాలు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలోకి పనిచేస్తున్నామని తెలిపారు. దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో తన నైతిక బాధ్యతగా భావించినట్లు లేఖలో పేర్కొన్నారు. 2026 మే 3న నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించిందని గుర్తు చేశారు. పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ...మిగతా 2 లో..."



## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

- గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ,జూలై25(ప్రజా సీమ)

నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది.

...మిగతా 2 లో...

## నా దీక్షనే అనుమానిస్తారా...?

- కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా
- విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన



న్యూఢిల్లీ,జూలై25(ప్రజా సీమ)

దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ...మిగతా 2 లో...



## మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ,జులై 25(ప్రజా సీమ)

ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు.

...మిగతా 2 లో...

## డిమాండ్లను అంగీకరించిన కేంద్రం...


### నిరసన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

- ప్రధాన డిమాండ్లకు కేంద్రం అంగీకరించడంతో నిరసన విరమించిన సీజేపీ
- నీట్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రభుత్వం హామీ
- 36 రోజుల పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కొనసాగిన ఆందోళన
- కేంద్ర మంత్రులు, సీజేపీ నేతల సంయుక్త మీడియా సమావేశంలో ప్రకటన



నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో గత కొన్ని వారాలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తమ నిరసనను విరమించింది. తమ ప్రధాన డిమాండ్ అయిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు, ఇతర డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రులు, సీజేపీ ప్రతినిధులు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం... కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ లతో సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా మరో దఫా చర్చలు జరిపారు. చర్చలు ముగిసిన అనంతరం జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు అంగీకరించిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్న సద్భావనతో నిరసనను తక్షణమే విరమిస్తున్నట్లు వారు తెలిపారు. తమ మద్దతుదారులంతా శాంతియుతంగా ఇళ్లకు తిరిగి వెళ్లాలని పిలుపునిచ్చారు.మంత్రి రాజీనామాతో పాటు, ప్రభుత్వం మరికొన్ని కీలక హామీలు ఇచ్చినట్లు సీజేపీ నేతలు వెల్లడించారు.


...మిగతా 2 లో...



## ఎల్-నినో కారణంగా తీవ్ర నీటి కొరత..

- మంత్రి నిమ్మల రామానాయుడు గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ అధికారులతో నిమ్మల ఉన్నత స్థాయి సమీక్ష
- మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యతనివ్వాలని సూచన

రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిపూర్ణ సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.



## సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా

- సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం
- వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుందాం
- ఆస్పరిలో సంజీవిని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు

కర్నూలు,జులై 25 (ప్రజా సీమ)

తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రు తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజలోరాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. ...మిగతా 2 లో...

## రాయలసీమను రత్నాలసీమగా మారుస్తా

- వేదవతిని త్వరగా పూర్తి చేసి లిఫ్ట్ చేస్తాం
- కర్నూలు పర్యటనలో సిఎం చంద్రబాబు హామీ

కర్నూలు ,జులై 25 (ప్రజా సీమ):

కర్నూలు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాయలసీమ ప్రగతి, తీవ్రమవుతున్న ఆర్థిక, నీటి సంక్షోభాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. రాయలసీమను 'రత్నాల సీమ'గా మారుస్తామని సీఎం ఆకాంక్షించారు. వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి, హంద్రీ-నీవా నుంచి నీటిని లిఫ్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. ...మిగతా 2 లో...

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై బండి సంజయ్..

## 'దేశమే ముందు'

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రశంసించిన బండి సంజయ్
- ఇది బీజేపీ 'దేశమే ముందు' అనే సిద్ధాంతానికి నిదర్శనమన్న కేంద్రమంత్రి
- పదవులు శాశ్వతం కాదని, ప్రజా విశ్వాసమే ముఖ్యమని వ్యాఖ్య

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. ఇది బీజేపీ అనుసరించే "దేశం మొదట, పార్టీ తర్వాత, వ్యక్తిగతం ఆఖరు" అనే మూల సిద్ధాంతానికి నిదర్శనమని ఆయన శనివారం పేర్కొన్నారు. ...మిగతా 2 లో...



# నా దీక్షనే అనుమానిస్తారా...?

మొదటిపేజీ తరువాయి

గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు (ఔఇఇ÷ ÷ఔసనీబిబబి). అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? దిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామా విషయంలో ఎటూ తేల్చకుండా కేంద్రం ఎక్కువ కాలం నాన్చలేదు. కొన్నిరోజుల్లో మంత్రి రాజీనామా సమర్పిస్తారని నాకు తెలుసు. అందుకే ఆ విషయంలో నేను మరీ ఎక్కువ ఒత్తిడి చేయలేదు' అని వాంగ్‌చుక్ వివరించారు. దీక్ష కొనసాగిస్తున్న సమయంలో.. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్ నుంచి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరిస్థితులపై తాజాగా వాంగ్‌చుక్ స్పందించారు. ఆ ఆసుపత్రి జైలులా అనిపించింది. ఒక ఖైదీ కంటే తీవ్రంగా పరిగణించారు. చుట్టూ ఆంక్షలే. నేను నా గది నుంచి కూడా రాలేకపోయా. ఎవరిని కలవడానికి అనుమతించలేదు. ముగ్గురు బంధువులను మాత్రం నావద్దకు రానిచ్చారు అంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆయన భార్య గీతాంజలి దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో.. అక్కడి నుంచి మేదాంత ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే.

# కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..!

మొదటిపేజీ తరువాయి

20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జూన్ 21నపరీక్ష విజయవంతంగా పూర్తయిందని అన్నారు. తాను మొదటి రోజు నుంచే బాధ్యత తీసుకున్నాని, ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోకుండా కృషి చేశానని పేర్కొన్నారు. జూలై 16న ప్రకటించిన ఫలితాల్లో పేద, వెనకబడిన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు విజయాన్ని సాధించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థుల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను బాధించిందని చెప్పారు. గత 10 రోజులుగా జరిగిన పరిణామాలు కలిచివేశాయని, ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, దేశవ్యతిరేక శక్తులు దీనిని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, జాతీయ ఐక్యత కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండేందుకు, వారు చదువులపై దృష్టి సారించేలా చేయడానే ఉద్దేశంతోనే ప్రధాన మంత్రికి రాజీనామా లేఖ సమర్పించినట్లు వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు, విద్యాశాఖ అధికారులకు థాంక్స్ చెప్పారు. దేశ సేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజలు, దేశ యువత కోసం సేవ చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

# ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

మొదటిపేజీ తరువాయి

'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

# మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి

మొదటిపేజీ తరువాయి

దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయమని, ప్రధాని మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి అని వ్యాఖ్యానించారు. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలు అన్నింటిదీ ఈ విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ.. ఇది తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు క్షణాల్లో వైరల్ కాగా దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ 'నమస్కారం', 'లవ్' ఎమోజీలను జతచేసి తన మద్దతు చాటారు.

# డిమాండ్లను అంగీకరించిన కేంద్రం...

## నిరసన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

మొదటిపేజీ తరువాయి

నీట్ ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఉపసంహరించుకుంటామని, భవిష్యత్తులో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అలాగే, నీట్ వ్యవహారంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం గరిష్ఠ పరిహారం అందజేస్తామని స్పష్టం చేసిందని వివరించారు. ఈ సందర్భంగా సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరించింది. కాబట్టి ఆందోళన చేస్తున్న వారందరూ తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని కోరుతున్నాం" అని అన్నారు. అశుతోష్ రంకా మాట్లాడుతూ, "36 రోజుల నిరసన తర్వాత ప్రభుత్వం దిగివచ్చింది. మా డిమాండ్లు తీవ్రమైనవి కావు, చాలా సాధారణమైనవి. ఇప్పుడు ప్రభుత్వం వాటిని ఆమోదించింది" అని పేర్కొన్నారు.

# సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా

మొదటిపేజీ తరువాయి

అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.


# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై బండి సంజయ్.. 'దేశమే ముందు'

మొదటిపేజీ తరువాయి

పదవులు శాశ్వతం కాదని, ప్రజల విశ్వాసమే అత్యంత కీలకమని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. విద్యార్థి ఉద్యమ నేత స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతల వరకు ధర్మేంద్ర ప్రధాన్ దశాబ్దాలుగా దేశానికి అందించిన సేవలను కొనియాడుతూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే ప్రజల గొంతుకను వినడం, వారి అభిప్రాయాలను గౌరవించడమేనని బండి సంజయ్ వివరించారు. క్లిష్ట సమయాల్లో బాధ్యతను స్వీకరించే ధైర్యం ప్రదర్శించడమే నిజమైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురైన అవకతవకలపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో, ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఆయన నైతిక విలువలకు నిదర్శనమని కొనియాడారు. నీట్-యూజీ సహా పలు పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. ఈ పరిణామాల మధ్య ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన రాజీనామా లేఖను సమర్పించారు. కాగా, ఇది ప్రజాస్వామ్య పోరాట ఫలితమని, యువత ఉద్యమానికి లభించిన విజయమని ప్రతిపక్ష నేతలు అభివర్ణిస్తున్నారు.

# ఎల్-నినో కారణంగా తీవ్ర నీటి కొరత..

మొదటిపేజీ తరువాయి



గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ సీఈలు, ఎస్ఈలతో ఈరోజు నిర్వహించిన ఉన్నత స్థాయి టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎల్-నినో ప్రభావం, క్లిష్టమైన నీటి కొరత దృష్ట్యా ఇరిగేషన్ శాఖలోని పైస్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరి సెలవులను రద్దు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో దాదాపు 55 లక్షల మందికి తాగునీరు అందించాల్సి ఉందని... అందుకే ఈ నీటిని తాగునీటికి, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. సీలేరు జలాలను గోదావరి డెల్టా ఖరీఫ్ అవసరాల కోసం వాడుతున్నామని, మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే గోదావరి ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూస్తూ, పోలవరం కుడి కాలువ నీరు వృథా కాకుండా కృష్ణా డెల్టాకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇక కృష్ణా డెల్టా పరిధిలో నాగార్జున సాగర్ నిండకుండానే వరి సాగు చేస్తే ఆ ప్రాంత రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ సీజన్‌లో సాగర్‌కు నీళ్లు రాకపోతే 2027 జూన్ వరకు పులిచింతల, పట్టిసీమ నీళ్లను తాగునీటి అవసరాలకే భద్రపరచుకోవాలని స్పష్టం చేశారు. పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 10 జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

## బిఆర్ఎస్ ఎపి వద్దిరాజు రవిచంద్ర

న్యూఢిల్లీ,జులై 25(ప్రజా సీమ)

ప్రశ్నాపత్రం లీక్ కావడానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదుల విజయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ , ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కాక్రోచ్ సైన్యాన్ని చూసి దేశం గర్వపడుతున్నదని, విద్యార్థులు,యువత ఆగ్రహించి పోరుబాట పడితే,అది ఏ స్థాయిలో ఉంటుందో యావత్ ప్రపంచం మరోసారి చూసిందని పేర్కొన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, బెదిరించినా, భయపెట్టినా, నిర్బంధాలు ప్రయోగించినా, లాఠీలెత్తినా, దేశద్రోహులు,సంఘ విద్రోహులు అని ముద్రవేసినా కూడా యువత వెనుకంజ వేయకుండా ఉద్యమించిందని అన్నారు. విద్యార్థుల పోరాటంలో న్యాయం ఉందని, ధర్మమైనదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. విద్యార్థుల ధర్మమైన ఆగ్రహావేశాలకు పార్లమెంట్ గేట్లు కూడా మూసేయాల్సిన పరిస్థితి తలెత్తిందంటే వారి బలమెంతో పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేస్తూ,దేశంలో ఇక ముందు ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా, అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా పాలకులకు హితవు పలికారు.

# అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

## ధర్మేంద్ర రాజీనామాపై కెటిఆర్ పోస్ట్

హైదరాబాద్,జులై 25 (ప్రజా సీమ):

యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజీపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజీపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజీపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.



# రాయలసీమను రత్నాలసీమగా మారుస్తా

మొదటిపేజీ తరువాయి

జొన్నగిరి గోల్డ్ మైనింగ్‌తో దానికి 'స్వర్ణగిరి'గా పేరు మార్చామని, 2028 మార్చి నాటికి 'రాయలసీమ స్టీల్స్' అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పుట్టపర్తి కేంద్రంగా యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను తీసుకొస్తామని, అలాగే రాయలసీమను రూ. లక్ష కోట్లతో 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ ఏడాది పోలవరం పనులు పూర్తి చేసి, 2027 మార్చి నాటికి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధ పరిణామాల వల్ల గ్యాస్, పెట్రోల్ సరఫరా తగ్గి రాష్ట్ర ఆదాయం పడిపోయిందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం 51 శాతం తగ్గడం వల్ల భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయని చెప్పారు. అందుకే ఈ ఏడాది రైతులు వరి పంట వేయవద్దని, ఆరుతడి పంటలు, పండ్లు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. అలూరు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిపై సీఎం ఆరా తీశారు. నీటి సరఫరాలో ఆలూరు 18 శాతం వెనుకబడి ఉందని సభలో ప్రజలు చెప్పగా, సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. అలాగే.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. దంపతులు కూడా ఒకే ఇంట్లో ఉంటూ ఫోన్లకే పరిమితం కావడం సరికాదన్నారు. ÷ూష్ట్రంలో ఒక దౌర్భాగ్య పార్టీ ఉందంటూ సీఎం మండిపడ్డారు. బాబాయిని గొడ్డలితో చంపి, ఆ నిందను తనపై వేసేందుకు ప్రయత్నించారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఎవరు గొడ్డలి ఎత్తినా ఆ చేయి లేకుండా పోతుందని హెచ్చరించారు. తాము అందించే 'సూపర్ సిక్స్' పథకాలతో అభివృద్ధి, సంక్షేమం సమతులంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు–నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావ-నకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది. పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజిపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదాని పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

# జిల్లా యుపీఎఫ్ పాస్టర్స్ 4వ యానివర్సరీ డే అంగరంగ వైభవంగా జరిగింది.

(ప్రజా సీమ)

)డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ 4వ యానివర్సరీ డే దేవునికి మహిమ కరంగా మన్నా జూబ్లీ చర్చ్ అమలాపురం ఈదరపల్లిలో జోన్ చైర్మన్ సత్య ప్రసాద్ జిల్లా సెక్రెటరీ పాస్టర్ యెహోషువ అధ్యక్షతన జరిగిందిజిల్లా యుపీఎఫ్ అధ్యక్షులు రెవరెండ్ కార్ల్ డేవిడ్ కొమనాపల్లి మాట్లాడుతూ మన ఐక్యత ఎంతో బలం, క్రీస్తు ప్రేమను మనం చూపిస్తూ ప్రకటించాలి దైవజనుడు ఎవరైనా మరణిస్తే 10 వేల రూపాయలు సహకారం అందిస్తూ మెడికల్ గా కూడా సహకారం అందిస్తామన్నారు జిల్లా యుపీఎఫ్ వైస్ ప్రెసిడెంట్స్ విక్టర్ నందా యూవీ భాస్కరరావు ఎర్నెస్ట్ తాతపూడి జిల్లా జనరల్ సెక్రెటరీ యెహోషువ వెల్ఫేర్ సెక్రెటరీ సిహెచ్ డానియేలు జాయింట్ సెక్రెటరీ అబ్రహం పిన్ని,ట్రెజరర్ ఇమ్మానుయేలు జాయింట్ ట్రెజరర్ విలియమ్స్ రిపోర్ట్ అందజేసి శుభాలు తెలియజేశారు జిల్లా నుండి 6 జోన్స్ నాయకులు, 18 మండలాలు కమిటీ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొని మీ రిపోర్టు అందజేసి నాలుగు సంవత్సరాలు దిగువజీకరంగా జరిగించిన జిల్లా నాయకులను అభినందించారు. డిసెంబర్ ఒకటో తేదీన జిల్లా యూపీఎఫ్ ఫ్యామిలీ క్రిస్మస్ అద్భుతంగా జరుగుటకు సిద్ధపడమన్నారు 200 మంది నాయకులు పాల్గొన్నారు చక్కటి ప్రేమ విందు అందజేశారు.





# టిబిఆర్ సైనిక్ స్కూల్‌లో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

### వీర జవాన్ల త్యాగాలను చిరస్థాయిగా గుర్తుంచుకోవడం ప్రతి భారతీయుని బాధ్యత : డా. టి. భోగేశ్వరరావు

(ప్రజా సీమ)

కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన అపూర్వ ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ శనివారం పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం అలంపురం టిబిఆర్ సైనిక్ స్కూల్, టిబిఆర్ జూనియర్ కాలేజ్ అండ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు అత్యంత వైభవంగా . నిర్వహించారుఈ కార్యక్రమానికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రార్ డా. దినేష్ శంకర్ రెడ్డి జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కొండలరావు ముఖ్య తిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి టిబిఆర్ గ్రూప్ చైర్మన్ డా. టి. భోగేశ్వరరావు అధ్యక్షత వహించారు.కార్యక్రమం ప్రారంభంలో టిబిఆర్ డిఫెన్స్ అకాడమీ ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుతమైన మార్చ్‌పాస్ట్ నిర్వహించి ముఖ్య అతిథులకు గార్డ్ ఆఫ్ హానర్ అందజేశారు. అనంతరం అమర జవాన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి వీర అమరవీరులకు నివాళులర్పించారు. దేశభక్తిని ప్రతిబింబించే జాతీయ గీతాలాపన, మౌన నివాళి కార్యక్రమాలు అందరినీ భావోద్వేగానికి గురిచేశాయి.అనంతరం విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించే నృత్యాలు, దేశభక్తి గీతాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి కార్గిల్ యుద్ధ వీరుల సాహసగాథలను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి డా. దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధం భారత సైన్యం ధైర్యసాహసాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును తీసుకువచ్చిందని తెలిపారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో సైనిక్ పాఠశాలల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఎప్పటికీ మరువకూడదని విద్యార్థులకు పిలుపునిచ్చారు.జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కొండలరావు మాట్లాడుతూ భారత సైన్యంలో సేవ చేయడం అత్యున్నత గౌరవమని, దేశ రక్షణ కోసం యువత అధిక సంఖ్యలో సైన్యంలో చేరాలని ఆకాంక్షించారు. కార్గిల్ యుద్ధంలో మన జవాన్లు ప్రదర్శించిన పరాక్రమం ప్రతి భారతీయునికి ఆదర్శమని తెలిపారు.ఈ సందర్భంగా టిబిఆర్ గ్రూప్ చైర్మన్ డా.



టి. భోగేశ్వరరావు మాట్లాడుతూ, కార్గిల్ విజయ్ దివస్ కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదని, దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వీర జవాన్లకు కృతజ్ఞతలు తెలిపే పవిత్రమైన సందర్భమని అన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో కూడిన భావి సైనికాధికారులను తయారు చేయడమే టిబిఆర్ సైనిక్ స్కూల్ మరియు డిఫెన్స్ అకాడమీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా దేశ సేవలో విశిష్ట సేవలు అందించిన యుద్ధ వీరులను వీర నారీలను ఘనంగా సత్కరించి శాలువాలు, జ్ఞాపికలు అందజేసి వారి సేవలను కొనియాడారు. వారి జీవిత గాథలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.అదేవిధంగా ఇటీవల నిర్వహించిన అగ్నివీర్ నియామక పరీక్షలో లిఖిత పరీక్షలో అర్హత సాధించిన టిబిఆర్ డిఫెన్స్ అకాడమీకి చెందిన 18 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. వారి విజయానికి కృషి చేసిన అధ్యాపకులను, శిక్షకులను కూడా ఈ సందర్భంగా అభినందించారు.కార్యక్రమంలో టిబిఆర్ సైనిక్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీమతి పద్మావతి సీఈఓ రవి కిరణ్ ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగరాజు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.కార్యక్రమం చివరలో దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన కార్గిల్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ భారతమాతకు జై నినాదాలతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ చైతన్యం మరింత పెంపొందించబడిందని నిర్వాహకులు తెలిపారు.

# ఆధ్యాత్మిక వాతావరణంలో తొలి ఏకాదశి వేడుకలు

### - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె (ప్రజా సీమ) :

తొలి ఏకాదశిని పురస్కరించుకొని శనివారం మదనపల్లి పట్టణం,అమ్మచెరువు మిట్టలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కూటమి నాయకులతో కలసి స్థానిక ఎమ్మెల్యే యం.షాజహాన్ బాషా స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.శ్రీ మహావిష్ణువు దివ్య అనుగ్రహంతో ప్రతిఇంట సుఖశాంతులు,అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు.ప్రజలంతా ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని సూచించారు.నియోజవర్గంలో ఆలయాల అభివృద్ధి,నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు రామిశెట్టి కృష్ణ (కమలామర్రి),రెడ్డి రాయల్,జహా యువసేన నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# అత్యుత్తమ విద్యాప్రమాణాలకు నిలయం నారాయణ

### - ఈకిడ్స్ శాఖలో కన్నుల పండులా పేరెంట్స్ డే

### - ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.ఐ ఆంజనేయులు

మదనపల్లె (ప్రజా సీమ)

: నారాయణ ఈకిడ్స్,మదనపల్లె శాఖలో పేరెంట్స్ డే వేడుకలు శనివారం అత్యంత వైభవంగా,ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.ఐ యు.ఆంజనేయులు తమ ప్రేరణాత్మక సందేశంతో తల్లిదండ్రులను,విద్యార్థులను ఉత్తేజపరిచారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షఫీ,ఈకిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ శిరీషా,కో–ఆర్డినేటర్ మొబీన్ తేజ్,ఉపాధ్యాయ బృందం,తల్లిదండ్రులు మరియు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఇందులో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,నృత్యాలు,ఆటలు,తల్లిదండ్రులు--పిల్లలు కలిసి పాల్గొన్న వినోదాత్మక పోటీలు అందరినీ అలరించాయి.తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ చిన్నారులతో కలిసి చిరస్మరణీయమైన క్షణాలను ఆస్వాదించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు – పాఠశాల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.క్రమశిక్షణ,అత్యుత్తమ విద్యాబోధనకు నారాయణ విద్యాసంస్థలు చక్కని వేదికలని,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ నారాయణ ఈకిడ్స్,మదనపల్లె శాఖ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసింది.



# చెందుర్తి శివారులో అక్రమ గ్రావెల్ నిల్వలు.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

కాకినాడ జిల్లా (ప్రజా సీమ)

గొల్లప్రోలు, మండలం చెందుర్తి శివారులోని పోలవరం కాలువ గట్టుపై నుంచి తరలించిన గ్రావెల్‌ను చెందుర్తి హైవేకు ఆనుకుని ఉన్న దుర్గమ్మ గుడి సమీపంలో భారీగా నిల్వ చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపె సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.స్థానికుల సమాచారం మేరకు, శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కూడా అక్రమంగా గ్రావెల్ తరలింపు కొనసాగినట్లు చెబుతున్నారు. ఈ అక్రమ గ్రావెల్ దందాను స్థానికంగా “స్వామి” అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ఈ విషయమై గొల్లప్రోలు రెవెన్యూ అధికారులు, పోలీసులకు ముందస్తుగా సమాచారం అందించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అక్రమ గ్రావెల్ మాఫియాకు అధికారుల అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ గ్రావెల్ నిల్వలు, రవాణాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పిఠాపురంలో రైతుల నీటి కష్టాలు: కొత్త కాలువ వద్ద

## పరిశీలించినవైస్సార్సీపీ పిఠాపురం ఇంచార్జ్ వంగా గీత.

కాకినాడ జిల్లా(ప్రజా సీమ )

పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు మల్లవరం రోడ్డులోని కొత్త కాలువ వద్ద నెలకొన్న నీటి ఎద్దడి పరిస్థితిని పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు.ాదీజ మరియు ఏలేరు నుంచి సకాలంలో నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ సాగుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందన కొరవడిందని తెలిపారు.వెంటనే స్పందించిన వంగా గీతా విశ్వనాథ్ సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, రైతులు నష్టపోకుండా వెంటనే నీరు విడుదల చేయాలని కోరారు. సకాలంలో నీరు విడుదల చేయని పక్షంలో 'ఛలో ఏలేరు' కార్యక్రమం చేపట్టి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, పిఠాపురం వైఎస్ఆర్సీపీ రైతులకు అండగా ఉంటుందని ఆమె ప్రకటించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఏలేరు, పీబీసీ ఆయకట్టు కార్యకర్తలు పాల్గొన్నారు.






# పంటల బీమా గడువు పొడిగింపు

## జూలై 31 వరకు ప్రత్తి పంటకు అవకాశం

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )




గొల్లప్రోలు, ఖరీఫ్--2026 సీజన్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్బీవై) కింద అమలు చేస్తున్న పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.వి.వి. సత్యనారాయణ కోరారు.గొల్లప్రోలు మండలంలో ప్రత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యేక వాతావరణ ఆధారిత పంటల బీమాను అమలు చేస్తోందన్నారు. ప్రత్తి పంట బీమా నమోదు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.రైతులు ఎకరానికి రూ.2,000 ప్రీమియం చెల్లించి మీ సేవా కేంద్రాలు లేదా బ్యాంకుల ద్వారా బీమా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పంట నష్టం సంభవించినట్లయితే రూ.40 వేల వరకు బీమా పరిహారం లభిస్తుందని వివరించారు. ఇప్పటికే పంట విత్తిన రైతులతో పాటు, విత్తేందుకు సిద్ధంగా ఉన్న రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు.మండలంలో ఇప్పటివరకు 171 మంది రైతులు ప్రీమియం చెల్లించినట్లు తెలిపారు. పంట రుణాలు తీసుకున్న రైతుల బీమా ప్రీమియాన్ని సంబంధిత బ్యాంకులే మినహాయించి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.వరి పంటకు రూ.760 బీమా ప్రీమియాన్ని ఆగస్టు 15లోపు బ్యాంకులు, సహకార సంఘాలు లేదా మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి సూచించారు. రైతులంతా గడువులోపు బీమా నమోదు చేసుకుని పంటలకు రక్షణ కల్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# మదనపల్లెలో ఏటియం మిషన్ ఎత్తుకెళ్లిన దొంగల ముఠా

## - నిందితుల కోసం పోలీసులు ముమ్మర గాలింపు

మదనపల్లె (ప్రజా సీమ)

: అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె పట్టణంలో శనివారం వేకువజామున దొంగల ముఠా సినీ ఫక్కీలో ఏటీఎం మిషన్ ఎత్తుకెళ్లారు.ఎత్తుకెళ్లిన ఏటియం మిషన్ ను మదనపల్లె నియోజకవర్గం,నిమ్మనపల్లె సమీపంలోని నూరుకుప్పల కొండ ప్రాంతంలో ధ్వంసమైన ఏటీఎం విడిభాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దొంగలు ఉపయోగించిన వాహనం నిమ్మనపల్లె వైపుగా వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు,డ్రోన్ కెమెరాల సహాయంతో ఆ ప్రాంతంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.అయితే నూరుకుప్పల కొండకు సమీపంలో ఉన్న అగ్రహారం వద్ద ఏటీఎంను గ్యాస్ కట్టర్లతో ధ్వంసం చేసి,నగదును దోచుకెళ్లినట్లు ఆధారాలు లభించాయి.సంఘటన స్థలంలో ధ్వంసమైన ఏటీఎం మిషన్ విడిభాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ప్రస్తుతం ఆ నగదు దోపిడీకి పాల్పడిన ముఠా పట్టుబడిందా లేదా అనే వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.



# వ్యవసాయంలో కొత్త అధ్యాయం.

## వీబీజీ రంజీతో ఉద్యాన పంటలకు ప్రాధాన్యం: ఎంపీడీవో జయశ్రీ

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వీబీజీ రాంజీ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవనాల అభివృద్ధితో అనుసంధానించి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టింది. చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచడం, ఉద్యాన పంటల సాగును విస్తరించడం ఈ పథకం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తోంది.ఈ కార్యక్రమంలో భాగంగా పుల్లంపేట మండలానికి 140 ఎకరాల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. మండలంలోని అనంతయ్యగారిపల్లి, కొమ్మనవారిపల్లి, రామసముద్రం, పీవీజీ పల్లి, గారాలమడుగు, రంగంపల్లి, అనంతముద్రం, కొత్తపేట, దలవాయిపల్లి తదితర గ్రామాల నుంచి 28 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, అందరి దరఖాస్తులను అర్హత ఆధారంగా ఆమోదించారు. ఇప్పటివరకు 40 ఎకరాలకు అంచనాలు (ఎస్టిమేట్లు) సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో రైతు చింత వెంకట సుబ్బారెడ్డి పొలంలో నిమ్మ మొక్కలను నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా కొత్తపేట ప్రత్యేక అధికారి తాసిల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ, సాంప్రదాయ పంటలతో పాటు నిమ్మ, మామిడి, జామ వంటి ఉద్యాన పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల నాటకం, సంరక్షణ, నీటి వసతులు వంటి పనులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.ఎంపీడీవో జయశ్రీ మాట్లాడుతూ, వచ్చిన ప్రతి దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని మండలానికి కేటాయించిన 140 ఎకరాల లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం సంకల్పించిన ఆశయాలను విజయవంతంగా అమలు చేయడంలో సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాలని, వీబీజీ రాంజీ అమలులో పుల్లంపేట మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నం శివయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సునీల్, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.






# గురుభక్తి,ధైర్యసాహసాల్లో ఏకలవ్యుడు నేటితరానికి స్ఫూర్తి





## - నిస్సార్ అహ్మద్,దేశాయ్ తిప్పారెడ్డిలు ప్రశంసలు

## - వైకాపా కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు

మదనపల్లె (ప్రజా సీమ) :

పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గిరిజనుల ఆరాధ్యదైవం,ధైర్యం,ఆత్మగౌరవం,గురుభక్తి కి ప్రతీక అయిన మహావీరుడు ఏకలవ్యుని జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు.వైకాపా గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ హాజరై ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి మాట్లాడుతూ ఏకలవ్యుడు గురుభక్తి, క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం,పట్టుదలకు చిరస్మరణీయమైన ప్రతీక అని పేర్కొన్నారు.అంతేకాకుండా ఆయన త్యాగనిరతి అపారమైనదని,తన గురువు పట్ల చూపిన అచంచల భక్తి,స్వీయ త్యాగం ద్వారా సమాజానికి గొప్ప సందేశాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు.అనంతరం ఎస్.నిసార్ అహమద్ మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాలకు స్ఫూర్తినిచ్చే మహనీయుడిగా ఏకలవ్యుని జీవితం నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజనుల అభ్యున్నతి,విద్య ,ఉపాధి,సామాజిక న్యాయం కోసం పార్టీ అధినేత వై.యస్ జగన్ నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్. రెడ్డి,ఎస్.టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆవుల మల్లికార్జున,బీరంగి రేవతి,ఎం.ఉత్తమేశ్వర్ రావు,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,బయ్యా రెడ్డి,ఈశ్వర్ నాయక్,గుండ్లూరు రఫీక్,ధనలక్ష్మి, మంజుల ,గుదిటి చరణ్, నాగార్జున నాయుడు, సత్తార్,ఎన్ .నవాజ్, రామాంజులు,మాధవరెడ్డి,మాలేపాడు చలపతి,సోమశేఖర్ రెడ్డి,సాంబశివా రెడ్డి,ముజీబ్,షేక్ జబి,అనుబంధ విభాగాల నాయకులు,కార్యకర్తలు,గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొని మహావీరుడు ఏకలవ్యునికి ఘనంగా నివాళులర్పించారు.

# మదనపల్లె తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

## - రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ ఫేజ్--2కు ఆమోదం

## - 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేసేలా చర్యలు

## - అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా,మదనపల్లె నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జల్ జీవన్ మిషన్ పథకం కింద మదనపల్లె నియోజకవర్గానికి రూ.1,000 కోట్ల అంచనా వ్యయంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ఫేజ్--2 మంజూరైనట్లు వెల్లడించారు.ఈ ప్రాజెక్టు మంజూరులో స్థానిక శాసనసభ్యులు షాజహాన్ బాషా ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా మదనపల్లె నియోజక వర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె ,రామసముద్రం గ్రామీణ మండలాలతోపాటు మదనపల్లె పట్టణానికి సురక్షితమైన,నిరంతర తాగునీటి సరఫరా కల్పించ నున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఇప్పటికే వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 కింద గండికోట రిజర్వాయర్ నుంచి గుర్రంకొండ మండలం మావిళ్లవారిపల్లె వరకు పైపులైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.మావిళ్ల వారిపల్లె వద్ద నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి,అక్కడి నుంచి మదనపల్లె నియోజకవర్గంతోపాటు మదనపల్లె మున్సిపాలిటీకి తాగునీటిని సరఫరా చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు వివరించారు.వాటర్ గ్రిడ్ ఫేజ్-2కు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనున్నామని,18 నెలల్లోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ మేరకు ప్రాజెక్టు అమలుకు అవసరమైన వివిధ శాఖల అనుమతులను త్వరిత గతిన పొందాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.మదనపల్లె నియోజకవర్గ ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఈ ప్రతిష్టాత్మక వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తయితే,ఈ ప్రాంత ప్రజలకు సురక్షితమైన,నాణ్యమైన తాగునీరు నిరంతరం అందుబాటులోకి రానుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# మిట్స్ యూనివర్సిటీ పరీక్షా ఫలితాలు విడుదల

## - ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ్ భాస్కర్ చౌదరి వెల్లడి

మదనపల్లె (ప్రజా సీమ)

: మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్ డీమ్డ్ టు బి యూని వర్సిటీ)లో వివిధ కోర్సులకు సంబంధించిన రెగ్యులర్,సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి.యువరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2026లో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్25) రెగ్యులర్ ఎండ్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా జూన్ 2026లో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు,జూలై 2026లో నిర్వహించిన ఎంబీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు,ఎంసీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను కూడా విడుదల చేసినట్లు వివరించారు.విద్యార్థులు వెబ్సైట్ లోని స్టూడెంట్ పోర్టల్లో లాగిన్ అయి తమ ఫలితాలను పరిశీలించుకోవచ్చని సూచించారు.ప్రచురించిన ఫలితాల్లో ఏవైనా వ్యత్యాసాలు ఉన్నట్లయితే,ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి ఏడు రోజులలోపు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయానికి తెలియజేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ్ భాస్కర్ చౌదరి,ప్రో చాన్సలర్ ఎన్.ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయంపై చిన్నారుల్లో అవగాహన పెంపొందించేందుకు 'కార్న్ యాక్టివిటీ'

### శ్రీ ప్రత్యూష హై స్కూల్‌లో వినూత్న కార్యక్రమం

పుల్లంపేట (ప్రజా సీమ)

విద్యార్థుల్లో వ్యవసాయం పట్ల ఆసక్తి, అవగాహన పెంపొందించడంతో పాటు మొక్కజొన్న పంట ప్రాముఖ్యతను తెలియజేయాలనే లక్ష్యంతో పుల్లంపేటలోని శ్రీ ప్రత్యూష హై స్కూల్లో శనివారం "కార్న్ యాక్టివిటీ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కజొన్నతో వివిధ రకాల కళాత్మక, సృజనాత్మక నమూనాలను రూపొందించి తమ ప్రతిభను చాటుకున్నారు. అలాగే మొక్కజొన్నలోని పోషక విలువలు, రైతుల కష్టానికి ఉన్న విలువ, వ్యవసాయం మన జీవనాధారమనే అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ రాధ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం, ప్రకృతి పట్ల ప్రేమ, వ్యవసాయం పట్ల గౌరవ భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి తోడ్పడే కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంజి నరసింహులు, ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు రవీంద్రబాబు, రాధ, ఉపాధ్యాయులు నిషిత, అవని, వెంకటేశ్వరమ్మ, మౌనికతో పాటు



విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కాసల భాను ప్రసాద్ అభినందిస్తూ, విద్యార్థుల్లో విద్యతో పాటు విలువలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యత పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలలో నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.

# జి.ఓ. 396 రద్దు చేయాలి.. దస్తావేజు లేఖర్ల రిలే దీక్షలకు సీఐటీయూ మద్దతు

### ప్రైవేటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి: సీఐటీయూ నాయకులు

పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:

ప్రభుత్వం తీసుకొచ్చిన జి.ఓ. 396 ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణకు అవకాశం కల్పించడం సరికాదని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్ల సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పి-3 విధానంలో ప్రైవేటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు ఉంటే వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలే తప్ప, మొత్తం వ్యవస్థను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం సరైన విధానం కాదని విమర్శించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఆధునీకరించడం అవసరమేనని, అయితే ఆ పేరుతో ప్రైవేటీకరణ చేస్తే అవినీతి, అక్రమాలకు మరింత అవకాశం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్, పాస్‌పోర్టు సేవలను రిజిస్ట్రేషన్ వ్యవస్థతో పోల్చడం సరికాదని, కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలు, 22-ఏ భూముల సమస్యలు, మ్యుటేషన్లు వంటి అనేక సమస్యలు ఇప్పటికే ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో



రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రైవేటు చేతుల్లో పెట్టడం వల్ల ప్రజలకు మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రైవేటీకరణ వల్ల డాక్యుమెంట్ రైటర్లు, దస్తావేజు లేఖర్ల ఉపాధి కూడా ప్రమాదంలో పడుతుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం జి.ఓ. 396ను వెంటనే ఉపసంహరించుకుని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే రిజిస్ట్రేషన్ సేవలను కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ఎస్.శ్రీలక్ష్మి, కో-కన్వీనర్ ఏ.రోజా, పి.వి.రమణ, దస్తావేజు లేఖర్ల సంఘ నాయకులు జైసింహాస్వామి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి:

### ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి: నియోజకవర్గ కార్యదర్శి పి. రత్నమ్మ

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:

పుల్లంపేట పీహెచ్‌సీ పరిధిలో ఆశా వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం చంద్రకళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి పి. రత్నమ్మ, ఏఐటీయూసీ రైల్వే కోడూరు నియోజకవర్గ అధ్యక్షులు మాదరాజు గంగాధర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పి. రత్నమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి కనీసం రూ. 26 వేల వేతనం చెల్లించాలని, డీఎంహెచ్ఓ సంతకంతో గుర్తింపు కార్డులు, నాణ్యమైన యూనిఫాంలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లతో సర్వేల పేరుతో అదనపు పనులు చేయించడం నిలిపివేసి, వారి విధులకు సంబంధించిన పనులు మాత్రమే అప్పగించాలని కోరారు. గర్భిణులను ఆసుపత్రులకు తీసుకెళ్లే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని, ఆశా వర్కర్లను గౌరవప్రదంగా చూడాలని అన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు మాదరాజు గంగాధర్ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఎనిమిది పీహెచ్‌సీల పరిధిలో ఆశా వర్కర్లకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలిచి పరిష్కారం కోసం పోరాడుతున్న సంఘం ఏఐటీయూసీయేనని అన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నామని, ఆగస్టు 2న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం చేపట్టే పోరాట కార్యక్రమాల్లో ఆశా వర్కర్లంతా ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పుల్లంపేట పీహెచ్‌సీ ఏపీ ఆశా వర్కర్స్ మండల నూతన కమిటీని




ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా సరోజమ్మ, అధ్యక్షురాలిగా పి. నరసమ్మ, ప్రధాన కార్యదర్శిగా చంద్రకళ, కోశాధికారిగా పి. సునీల, ఉపాధ్యక్షులుగా ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి, హైమావతి, సహాయ కార్యదర్శులుగా రాజ, సులోచన, జ్యోతి, రాధా ఎన్నికయ్యారు. మిగిలిన ఆశా వర్కర్లను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి దాసరి జయచంద్ర, ఉపాధ్యక్షురాలు సరోజమ్మ, కోశాధికారి మురళి, లక్ష్మీకళ, నరసమ్మ, సునీల, ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి, హైమావతి, రాజ, సులోచన, జ్యోతి, రాధాతో పాటు పుల్లంపేట పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం

### మరణించిన ఉద్యోగి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం

### మాటల్లో కాదు.. చేతల్లో సంక్షేమం

చిట్వేలి,ప్రజా సీమ

చిట్వేల్ మండలం బకారాపురం కొత్తపల్లి సమీపంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో రెండు చేతులను కోల్పోయిన మల్లిక కార్తీక్ సతీమణి తనూజ కి రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో విద్యుత్ శాఖలో ఉద్యోగం కల్పించింది. ఈ సందర్భంగా సంబంధిత నియామక ఉత్తర్వుల ప్రతిని రైల్వే కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ , రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదాల్లో జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఈ ఉద్యోగం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం తోడుగా ఉంటుందని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డి ఈ గంగాధర్ రెడ్డి, ఏడి బాలాజీ, ఏ ఈ బాలకృష్ణ, గుత్తి నరసింహ మాదాసు



నరసింహ ఉప్పలపాటి శివప్రసాద్ రాజు బొంతల నాగేశ్వరరావు మద్దూరి మన్మథ కొనిశెట్టి సుబ్బరాయుడు గొబ్బిళ్ళ చెంగల్ రాయుడు వీరాంజనేయులు రాజు రంగయ్య కంచర్ల సుధీర్ రెడ్డి దొండ్ల వాగు మధు రోళ్ళ మోహన్ మాదాసు శివ పెద్దం గారి సాయి కావేరి అవినాష్ ఆనందలతేజ షేక్ రియాజ్ డాక్టర్ మహేష్ రెడ్డి ఆనందల సురేష్ దాది రామచంద్ర యానాద్ రాజు నాయిని సురేంద్ర మహంకాళి నాగేంద్ర మాదినేని రాజా పవన్ రాజు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జ్యోతి ఆలయం అభివృద్ధి చేస్తాం

### సిద్ధవటం మహా పుణ్యక్షేత్రం

### చైర్మన్,, పోతు గుంట రమేష్ నాయుడు

సిద్ధవటం(ప్రజా సీమ)

శ్రీశైల దక్షిణ ముఖ ద్వారం పేరుగాంచిన జ్యోతి సిద్దేశ్వర ఆలయం అభివృద్ధి చేస్తామని శ్రీశైలం దేవస్థానం ఆలయ చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు తెలిపారు సిద్ధవటం మండలంలోని జ్యోతి గ్రామంలో వెలిసిన జ్యోతి సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన శనివారందర్శించుకుని స్వామివారి విశిష్టతపై అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానానికి దక్షిణముఖ ద్వారమైన జ్యోతి సిద్దేశ్వర ఆలయాన్ని రూపురేఖలు మారుస్తామని త్వరలో ఆలయ అభివృద్ధికై శ్రీశైల దేవస్థానం పాలకమండలిలో సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి కొరకై తీర్మానం చేస్తామని ఆయన తెలిపారు సిద్ధవటం పెన్నా నది తీర ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలు ఉండడం మన కడప జిల్లా అదృష్టమని జ్యోతి క్షేత్రాన్ని అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకొస్తామని గ్రామస్తులు మండల వాసులు ప్రతి ఒక్కరు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు సిద్ధులు తపస్సు చేసిన సిద్ధవటం ఒక మహా పుణ్యక్షేత్రం అని పురాతనమైన కట్టడాలు శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని ఇలాంటి మహా పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు ఆయనకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి ఘనంగా శాలవతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందించారు ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ విజయ్ కుమార్ ఆలయ ఈఈ మురళి టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు సుబ్రమణ్యం రాష్ట్ర దూదేకుల సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు సింగల్ విండో అధ్యక్షులు దశరథ నాయుడు, నిత్య పూజ కోన ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్రయ్య టిడిపి మండల మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, ఎసి సెల్ మహిళా అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ, గ్రామ మాజీ సర్పంచ్ ప్రతినిధి, రవి , టిడిపి నేతలు పిచ్చిరెడ్డి, శేఖర్ రెడ్డి మల్లు రమణారెడ్డి, మల్లు విజయ భాస్కర్ రెడ్డి, టిడిపి యువనేత తుర్ర ప్రతాప్ నాయుడు ఐటీడీపీ అధ్యక్షులు హరి బిజెపి నేత, కాకర్ల విజయభాస్కర్ రెడ్డి, ఆలయ అర్చకులు తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు





# హత్య కేసులో ముద్దాయిలు అరెస్ట్

### హత్య కేసును చేధించిన పోలీసులు

### తప్పు చేస్తే శిక్ష తప్పదు

### మహిళా హత్య కేసులో ఇరువురికి రిమాండ్

### సీఐ సురేష్ రెడ్డి

వీరబల్లి,(ప్రజా సీమ)

హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందకు ప్రయత్నించి ఇద్దరు ముద్దాయిలు బొక్క బోర్లా పడ్డారు. ఒక మహిళను హత్య చేసి ఆత్మహత్యగా నమ్మిస్తూ తప్పించుకుని తిరిగేందుకు ప్రయత్నించిన ముద్దాయిలను వీరబల్లి పోలీసులు ఎంతో చాకచక్యంగా అరెస్టు చేసి రిమాండ్ కు పంపారు. ఈ విషయంపై సుండుపల్లి సిఐ సురేష్ రెడ్డి శనివారం నాడు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరబల్లి మండలం పరిధిలో తాటిగుంటపల్లె పంచాయతీలో కొత్తపల్లికి చెందిన వీరబల్లి వెంకట లక్ష్మమ్మ హత్య కేసులో ఇద్దరి ముద్దాయిలను శనివారం స్థానిక ఎస్ఐ సుస్మిత ఆధ్వర్యంలో అరెస్ట్ చేయడం జరిగిందనీ, వెంకట లక్ష్మమ్మ గత జనవరి నెల 31వ తేదీన ఊరు బయట బావిలో శవమై కనిపించిందనీ, అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు అనుమానస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేశామన్నారు. తర్వాత పోస్టుమార్టం రిపోర్టు ఆధ్వర్యంలో ఇది ఆత్మహత్య కాదని నిర్ధారించి ఇందుకు సంబంధించిన వారిపై విచారణ మొదలుపెట్టి రాజంపేట ఇన్చార్జి డిఎస్పి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం ముద్దాయి రమణయ్య. మృతురాలి వైద్య చికిత్స సంబంధించిన ఖర్చులు మరియు తాకట్టులో బంగారు విడిపించుకోవడంతో వారు తరచూ జరుగుతున్న గొడవల నేపథ్యంలో రమణయ్య మరియు అతని కుమారుడు శివ మహేష్ .(బాలు )కలిసి మృతురాలిని హత్య చేసి దాని ప్రకారం ప్రమాదంగా చిత్రీకరించేదుకు ప్రయత్నం చేసినట్లు నిర్ధారణఅయింది. అధికారులు స్పందించి విచారణ వేగవంతం చేయడంతో ఆమె భర్త రమణయ్య, ఆమె కుమారుడు మహేష్ కలిసి చంపి బావిలో వేసినట్లు రుజువు కావడంతో వారిని అరెస్టు చేసి డిమాండ్ పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె సీఐ సురేష్ రెడ్డి, ఎస్సై సుస్మిత. వారి సిబ్బందిని అభినందించారు.



# ఏళ్ల నిరీక్షణకు తెర





## చిట్వేల్‌లో రూ.15 లక్షల వ్యయంతో విద్యుత్ సదుపాయాల కల్పనకు శ్రీకారం

### పనులు ప్రారంభించిన అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

చిట్వేలి,ప్రజా సీమ

చిట్వేల్ పట్టణంలోని సత్యమ్మ వీధి కుమ్మరి వాడలో ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సదుపాయం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఈ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ప్రత్యేక చొరవతో, రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి సహకారంతో 15 లక్షల వ్యయంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అరవ శ్రీధర్ మరియు ముక్కా వరలక్ష్మి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి విద్యుత్ సదుపాయాల ఏర్పాటుకు సంబంధించిన పనులను ప్రారంభించి, స్థానికులతో మాట్లాడారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం లభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజలకు నేడు ఆ కలను నిజం చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. అలాగేముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. గతంలో ఎవరూ పట్టించుకోని సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ గంగాధర్ రెడ్డి, ఏడి బాలాజీ, ఏ ఈ బాలకృష్ణ, రాజు కుంట మాజీ సర్పంచ్,గుత్తి నరసింహ, మాదాసు నరసింహ ఉప్పలపాటి శివప్రసాద్ రాజు బొంతల నాగేశ్వరరావు మద్దూరి మన్మధ కొనిశెట్టి సుబ్బరాయుడు గొబ్బిళ్ళ చెంగల్ రాయుడు వీరాంజనేయులు రాజు రంగయ్య కంచర్ల సుధీర్ రెడ్డి దొండ్ల వాగు మధు రోళ్ళ మోహన్ మాదాసు శివ పెద్దం గారి సాయి కావేరి అవినాష్ ఆనందలతేజ షేక్ రియాజ్ డాక్టర్ మహేష్ రెడ్డి ఆనందల సురేష్ దాది రామచంద్ర యానాద్ రాజు నాయిని సురేంద్ర మహంకాళి నాగేంద్ర మాదినేని రాజా పవన్ రాజు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## డీఎస్సీ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: మౌనేంద్ర కుమార్ రెడ్డి

రైల్వే కోడూరు (ప్రజాసీమ)



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మౌనేంద్ర కుమార్ రెడ్డి ఒక మీడియా ప్రకటనలో మాట్లాడుతూ , డీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నీట్ పేపర్ లీక్ ఘటన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన పరిస్థితుల్లో, డీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా నైతిక బాధ్యత వహించాలని" అభిప్రాయపడ్డారు. అలాగే, "డీఎస్సీ పేపర్ లీక్ ఘటనలో ఎవరి పాత్ర ఉన్నా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు . నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆటలాడే వారిని ప్రభుత్వం ఉపేక్షించకూడదని . ఈ వ్యవహారంలో పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చేలా స్వతంత్ర సంస్థతో విచారణ జరిపి ప్రజలకు నివేదికను వెల్లడించాలి" అని ఆయన కోరారు.

## తెదేపా పట్టణ మహిళా విభాగాన్ని బలోపేతం చేయండి

### - రాటకొండ భారతికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచన

మదనపల్లె (ప్రజా సీమ)

: టిడిపి మహిళా విభాగం బలోపేతానికి కృషి చేయాలని రాటకొండ భారతికి ఎమ్మెల్యే షాజహాన్ సూచించారు. మదనపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాటకొండ భారతి నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం ఆమె ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాటకొండ భారతి మాట్లాడుతూ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి,ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం నిస్వార్ధంగా సేవలందించే వారికి అధిష్టానం తగిన గుర్తింపునిస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. పట్టణ మహిళా విభాగం బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని భారతికి సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ చౌదరి,నాగమణి తదితరులు పాల్గొన్నారు.





# నూకల రమేష్‌బాబుకు గౌరవ డాక్టరేట్

### సామాజిక సేవకు గుర్తింపుగా 'హానరరీ డాక్టరేట్ ఇన్ సోషల్ సర్వీస్' ప్రదానం

పుల్లంపేట,ప్రజా సీమ:

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం పుల్లంపేట గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, సామాజిక సేవకుడు నూకల రమేష్‌బాబుకు భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ ఎడ్యుకేషన్ సంస్థ హానరరీ డాక్టరేట్ ఇన్ సోషల్ సర్వీస్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన అందిస్తున్న విశిష్ట సామాజిక సేవ, ప్రజా జీవితంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవాన్ని అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నూకల రమేష్‌బాబు రాజకీయ ప్రస్థానం 1983లో ప్రారంభమైంది. 1983--85 మధ్య కడప జిల్లా తెలుగుదేశం పార్టీ జాయింట్ సెక్రటరీగా సేవలందించారు. అనంతరం జిల్లా అడ్వాక్ కమిటీ సభ్యుడిగా, టీడీపీ మండల అధ్యక్షుడిగా, 1987లో జిల్లా టీడీపీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1986--89 మధ్య చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు టీడీపీ పార్టీ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. అనంతరం జిల్లా హ్యాండీక్యాప్డ్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా, జిల్లా డీఆర్‌డీఏ సభ్యుడిగా, ఏపీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పలు కీలక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎదురులేని టిడిపి నాయకుగా అహర్నిశలు పార్టీ కోసం కష్టపడే నాయకుడిగా ఎంతో మంది ఎమ్మెల్యేలకు సపోర్టుగా నిలబడి వంటి చేత్తో గెలిపించిన నాయకుడిగా మన్ననలు పొందాడని కొనియాడారు. ప్రమాదవశాత్తు శారీరక వైకల్యం ఏర్పడినప్పటికీ ప్రజాసేవలో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా, పార్టీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయనకు పార్టీ అధిష్ఠానం సైతం విశేష ఆదరణ, గుర్తింపు ఇచ్చిందని పలువురు పేర్కొన్నారు. అలాగే, పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభ హైస్కూల్ అభివృద్ధి, పురోగతిలో నూకల రమేష్‌బాబు కీలక పాత్ర పోషించారని, ఆయన దూరదృష్టి






వల్లే ఆ విద్యాసంస్థ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిందని పలువురు విద్యావేత్తలు కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ, సామాజిక సేవను జీవిత ధ్యేయంగా కొనసాగిస్తున్న నూకల రమేష్‌బాబుకు గౌరవ డాక్టరేట్ లభించడం పుల్లంపేట ప్రజలకు గర్వకారణమని, ఆయన సేవలు మరింత విస్తరించాలని స్థానికులు, స్నేహితులు, అభిమానులు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

## గొల్లప్రోలులో పారిశుద్ధ్య పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

(ప్రజాసీమ):

గొల్లప్రోలు పురపాలక సంఘ కమిషనర్ దివిజా సంపతి శనివారం పట్టణంలోని 6, 7, 8 వార్డుల్లో విస్తృతంగా పర్యటించి డ్రైనేజీలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలతో మాట్లాడి పారిశుద్ధ్య నిర్వహణపై వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆమె సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి లైటింగ్ మరమ్మతులు చేపట్టించి సమస్యను పరిష్కరించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీల్లో కమిషనర్ దివిజా సంపతితో పాటు ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి కేర్ రఘు ప్రసాద్ పాల్గొన్నారు.





# ఆర్టీఓ కార్యాలయం తరలింపు నిర్ణయం విరమించుకోవాలి

### - మదనపల్లెలో ఏటీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

### - వైఎస్సార్సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ డిమాండ్

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లెలో ఉన్న ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీవో) కార్యాలయాన్ని రాయచోటికి తరలించే ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని,రాయచోటిలోని ఏటీఎస్ కేంద్రం మదనపల్లెలో ఏర్పాటు చేయాలని వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జింక వెంకట చలపతి,రఫీతో కలిసి నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లెను ఏర్పాటు చేసినా ఎప్పుడు సిఎం మనసు మార్చుకుని మళ్ళీ జిల్లా కేంద్రం రాయచోటికి తరలిస్తాడో చెప్పలేమని ఎద్దేవా చేశారు. మదనపల్లె పేరుమీద జిల్లా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరితే అన్నమయ్య జిల్లా ఇక్కడి ఏర్పాటు చేశారని,ఇది సిఎం చంద్రబాబునాయుడు ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. మదనపల్లెలో వేలాది మంది లారీ యజమానులు ఉన్నారని,వారి ఇబ్బందులు గుర్తెరిగి జిల్లా రవాణా శాఖ కార్యాలయం మదనపల్లెలో ఏర్పాటు చేయాలని కోరారు. అన్నమయ్య జిల్లాలో సుమారు 25 వేల భారీ వాణిజ్య వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఇంత పెద్దస్థాయిలో రవాణా అవసరాలు ఉన్న నేపథ్యంలో ఆర్టీవో కార్యాలయాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని,తరలించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. ఆర్టీవో కార్యాలయం తరలిస్తే వాహన యజమానులు,డ్రైవర్లు,వ్యాపారులు,విద్యా సంస్థలు,పరిశ్రమ వర్గాలు రిజిస్ట్రేషన్,పర్మిట్లు, పన్నులు,ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు,డ్రైవింగ్ లైసెన్సులు,యాజమాన్య బదిలీలు వంటి సేవల కోసం 80 కిలోమీటర్లు దూరంలోని రాయచోటికి వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. దీని వల్ల అదనపు ఖర్చులు, సమయ నష్టం, ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా మదనపల్లెకు 80



కిలోమీటర్ల పరిధిలో ఆటో మేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్ లేకపోవడంతో వాణిజ్య వాహనాల యజమానులు ఫిట్‌నెస్ పరీక్షల కోసం రాయచోటికి వెళ్లాల్సి వస్తోందన్నారు .దీనివల్ల ఇంధన వ్యయం,డ్రైవర్ వేతన భారం,వాహనాల నిలిపివేత కారణంగా ఆర్థిక నష్టం కలుగుతోందని తెలిపారు. మదనపల్లె ఆర్టీవో కార్యాలయం తరలింపు ప్రతి పాదనను విరమించుకోవడంతోపాటు మదనపల్లె కార్యాలయాన్ని జిల్లా రవాణా కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేసి,ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్‌ను మదనపల్లెలో ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజాసీమ

# ఘనంగా ఉప సర్పంచ్ తోట శివ సాయి గారి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలియజేసిన ముద్దా బాబుల్ రెడ్డి రామిరెడ్డి ధ్వజా రెడ్డి.**

**రైల్వే కోడూరు (ప్రజా సీమ ):**

రైల్వే కోడూరు ఉప సర్పంచ్ తోట శివ సాయి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శాలువా కప్పి గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పుల్లంపేట ఎంపీపీ ముద్ద బాబుల్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ అన్వర్ భాషా నాయకులు, ఆర్వి రమణ కౌరెడ్డి సిద్దయ్య , బత్తిన ఆనంద్ యాదవ్, నూక మహేశ్వర్ రెడ్డి, షేక్ అబ్దుల్ సలాం మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్ఆర్టీయూసీ నాయకులు సిగమాల సతీష్ రెడ్డి.

**రైల్వే కోడూరు (ప్రజా సీమ)**

:శనివారం తొలి ఏకాదశి సందర్భంగా రైల్వే కోడూరు మండలం బుడుగుంటపల్లి గ్రామంలోని శ్రీ కలియుగ వెంకటేశ్వర స్వామిని వైఎస్ఆర్టీయూసీ రైల్వే కోడూరు నాయకులు సిగమాల సతీష్ రెడ్డి (రామచంద్ర రెడ్డి ) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలియుగ వెంకటేశ్వర స్వామికి ప్రీతిపాత్రమైన శనివారం రోజున తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. మాజీ టీటీడీ చైర్మన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిపై కూటమి నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, నిజాలు వెలుగులోకి వచ్చి ఆయన కడిగిన ముత్యంలా నిలబడతారని విశ్వాసం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న విమర్శలకు సమాధానం చెప్పలేక రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. రెండు పర్యాయాలు టీటీడీ చైర్మన్‌గా సేవలందించి, శ్రీ వెంకటేశ్వర స్వామి సేవకు అంకితభావంతో టీటీడీ అభివృద్ధికి కృషి చేసిన భూమన కరుణాకర్ రెడ్డిని ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. అయితే కలియుగ వెంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలతో ఆయన ఎవరికి భయపడకుండా అన్యాయానికి ఎదురొడ్డి పోరాడతారని తెలిపారు. మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపై శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు, కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు సిగమాల సతీష్ రెడ్డి తెలిపారు.





# ఘనంగా మంచా నాగ మల్లేశ్వరి జన్మదిన వేడుకలు

**ప్రొద్దుటూరు ,ప్రజా సీమ:**

మాల మహానాడు జి.చెన్నయ్య వర్గం జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి పుట్టినరోజు వేడుకలు కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రొద్దుటూరులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్, ప్రొటెక్షన్, కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, మేకల వెంకటన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా అధ్యక్షులు, జేష్ఠది భాస్కర్ మరియు, వెంకటన్న మాట్లాడుతూ నాగమల్లేశ్వరి దళితుల సమస్యల మీద, రెండు తెలుగు రాష్ట్రాలలో, మంచి పట్టున్న నాయకురాలు అని దళిత సమస్యల మీద పోరాడుతున్న నాయకురాలని, కొనియాడారు. తదుపరి కేకు కట్ చేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు, జేష్ఠది మధు, ప్రొద్దుటూరు పట్టణ యూత్ ప్రెసిడెంట్ జాస్వర్, ప్రొద్దుటూరు తాలూకా యూత్ ప్రెసిడెంట్, మోపురి పుష్పరాజ్, ప్రొద్దుటూరు పట్టణకార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి నగర్ సాయి మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాలు

**29న భక్తిశ్రద్ధలతో నిర్వహణకు ఆహ్వానం**

**కడప జూలై 25 (ప్రజా సీమ):**



కడప నగరంలోని ప్రకృతినగర్, రాయచోటి రోడ్డులో ఉన్న శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాలు 2026 జూలై 29వ తేదీ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించ బడుతున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా కాగడ హారతి, పంచామృతాభిషేకం, నూతన వస్త్ర సమర్పణ, గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, వాస్తు పూజ, శాంతి హోమం, సుగంధ పరిమళాభిషేకం, శ్రీ సాయి సత్యవ్రతం, పూల అలంకరణ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా గురిజాల క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయబడుతున్నట్లు తెలిపారు. సమస్త భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి, శ్రీ షిర్డి సాయిబాబా ఆశీస్సులు పొందుతూ గురుపౌర్ణమి ఉత్సవాలను విజయవంతం చేయవలసిందిగా ఆలయ కమిటీ హృదయపూర్వకంగా ఆహ్వానించడం జరుగుతున్నది.

# నీటి సమస్య పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే కు విజ్ఞప్తి

**ప్రొద్దుటూరు జూలై 25 ప్రజా సీమ:**

తమ ప్రాంతానికి నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని వెంటనే జోక్యం చేసుకుని నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ 9 వ వార్డు ప్రజలు మాజీ కౌన్సిలర్ జిలానీ బాషా ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ని కలిసి విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం శ్రీనివాస నగర్ ప్రజలు మాజీ కౌన్సిలర్ జిలానీ బాషా లు మీడియాతో మాట్లాడుతూ గత రెండు నెలలుగా నీటి సరఫరా లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపారు. మున్సిపల్ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకపోవడంతో విషయం ఎమ్మెల్యే దృష్టి కి తీసుకెళ్ళడం జరిగిందని పేర్కొన్నారు.



# తాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి కొత్తబోర్లు డ్రిల్లింగ్

**- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే**

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె పట్టణం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నందు డ్రిల్లింగ్ చేస్తున్న బోరును శనివారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా పరిశీలించారు. ఆలాగే ఎస్.ఎస్ ట్యాంక్ పరిసరాల్లో ఉన్న పాత బోర్లను మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో,ఇంజనీరింగ్,హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. పట్టణంలో తాగునీటి సమస్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా డ్రిల్లింగ్ చేసిన బోర్లలో నీళ్లు పడటంపైన సంతోషాన్ని వ్యక్తం చేశారు. పుర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా,రాకుండా చేయడం కోసం అన్నిరకాల చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందుకోసం నిత్యం పర్యవేక్షించడంతోపాటు గతంలో వేసిన బోర్లు నీరు అడుగంటి ఆగిపోయిన వాటిని పునఃపరిశీలించి డిపెన్ చేయడం ద్వారా నీటి లభ్యతను పెంచేవిధంగా అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల,జంగాల వెంకటరమణ,జేసీబి వేణు తదితరులు పాల్గొన్నారు.





# మదనపల్లె పట్టణ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

**- కలుషిత ఆహార హోటళ్లపై చర్యలు తీసుకోవాలి**

**- బహుజన యువసేన నాయకుల డిమాండ్**

**మదనపల్లె (ప్రజా సీమ)**

జిల్లా కేంద్రమైన పట్టణంలో విచ్చలవిడిగా తయారవుతున్న కలుషిత ఆహారం,అపరిశుభ్ర వాతావరణంపై బహుజన యువసేన (బీవైఎస్) రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మదనపల్లెలోని పలు హోటళ్లు,రెస్టారెంట్లు మరియు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసి,రోజుల తరబడి నిలువ ఉంచిన పదార్థాలు,కుళ్లిన మాంసాన్ని వడ్డిస్తూ సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. కలుషిత ఆహారం తిని చిన్నారులు,వృద్ధులు తీవ్రమైన ఫుడ్ పాయిజనింగ్,వాంతులు,విరేచనాలు,టైఫాయిడ్,కామెర్లు వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారని పునీత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.?ఈ విషయమై బాధ్యులైన అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే అధికారుల నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. ఆఫీసు వేళల్లో వెళ్లినప్పటికీ జిల్లా ఫుడ్ సేఫ్టీ (ఆహార భద్రత) కార్యాలయం తాళం వేసి ఉండటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నేడు మాత్రమే కాకుండా ఇలా తరచూ కార్యాలయాలు మూసివేయడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులే ఇలా గైర్హాజరు కావడం దారుణమన్నారు. మదనపల్లెలోని కొన్ని హోటళు ్ల,రెస్టారెంట్లు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై ప్రత్యేక బృందాలతో తక్షణమే ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ,ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటళ్ల లైసెన్సులను వెంటనే రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయ వేళల్లో అందుబాటులో ఉండకుండా ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్న అధికారులపై శాఖాపరమైన విచారణ జరిపించాలి.?ప్రజల ప్రాణాలను రక్షించే వరకు బహుజన యువసేన ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా పునీత్ కుమార్ హెచ్చరించారు.



# చెందుర్తి శివారులో అక్రమ గ్రావెల్ నిల్వలు. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు, మండలం చెందుర్తి శివారులోని పోలవరం కాలువ గట్టుపై నుంచి తరలించిన గ్రావెల్‌ను చెందుర్తి హైవేకు ఆనుకుని ఉన్న దుర్గమ్మ గుడి సమీపంలో భారీగా నిల్వ చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల సమాచారం మేరకు, శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కూడా అక్రమంగా గ్రావెల్ తరలింపు కొనసాగినట్లు చెబుతున్నారు. ఈ అక్రమ గ్రావెల్ దందాను స్థానికంగా “స్వామి” అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై గొల్లప్రోలు రెవెన్యూ అధికారులు, పోలీసులకు ముందస్తుగా సమాచారం అందించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అక్రమ గ్రావెల్ మాఫియాకు అధికారుల అండదండలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ గ్రావెల్ నిల్వలు, రవాణాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# టమాట ధరలపై అవాస్తవ ప్రచారాలని రైతులు నమ్మవద్దు

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్**

**మదనపల్లె (ప్రజా సీమ)**

: మదనపల్లె మార్కెట్ యార్డులో టమాట ధర కిలోకు కేవలం రూ.3 మాత్రమే పలుకుతోందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి గత రెండు రోజుల్లో టమోటో ధరలు కిలోకు రూ.7 నుంచి రూ.11 వరకు పలికాయని,నేడు నాణ్యతను బట్టి కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకు ధర లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. మదనపల్లె మార్కెట్ యార్డులో టమాట ధర కిలోకు కేవలం రూ.3 మాత్రమే పలుకుతోందంటూ కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. గత ఏడాది ఇదే సమయంలో మదనపల్లె మార్కెట్‌కు రోజుకు సుమారు 1,550 మెట్రిక్ టన్నుల టమాట రాగా,ఈ ఏడాది 3,000 మెట్రిక్ టన్నులకుపైగా టమాట మార్కెట్‌కు చేరుతోందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి టమాట సరఫరా దాదాపు రెట్టింపు కావడంతో,డిమాండ్ తగ్గిన సమయంలో కొద్ది రోజుల పాటు ధరల్లో తగ్గుదల కనిపించిందని తెలిపారు. ప్రస్తుతం ధరలు క్రమంగా మెరుగుపడుతున్నాయన్నారు. ధరలు తగ్గిన సమయంలో రైతులకు నష్టం కలగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని,అన్నమయ్య జిల్లా నుంచి 60 మెట్రిక్ టన్నుల టమాటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మచిలీపట్నం,రాజమండ్రి,విజయవాడతోపాటు ఇతర ప్రాంతాలకు తరలించిందని వివరించారు. టమాట ధరలకు సంబంధించి వార్తలు ప్రచురించే ముందు మార్కెట్ అధికారులు,వ్యాపారులు లేదా రైతు ప్రతినిధులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని ఆయన కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని,ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు అన్యాయం జరగకుండా అవసరమైన చర్యలు కొనసాగుతాయని జంగాల శివరామ్ తెలిపారు.



# సక్సెస్ టాక్‌లో చెన్నై లవ్ స్టోరీ

టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన ప్రేమకథా చిత్రాల్లో 'చెన్నై లవ్ స్టోరీ' ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, నటి శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు రవి నంబూరి దర్శకత్వం వహించారు. జాతీయ అవార్డు గ్రహీత సాయి రాజేష్ అందించిన కథతో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పరుచుకోగా, ప్రీమియర్ షోల నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం నటన, శ్రీ గౌరీ ప్రియా సహజమైన అభినయం, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో విడుదలైన మొదటి రోజే 1.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం విశేషంగా మారింది. విడుదల రోజునే ఇంత భారీ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం సినిమా క్రేజ్‌ను ప్రతిబింబిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భావోద్వేగ సన్నివేశాలను మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన సంగీతం కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. తొలి రోజు స్పందనను బట్టి చూస్తే, 'చెన్నై లవ్ స్టోరీ' కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్ లో సిబ్బంది మాటలు హైలైట్‌గా నిలిచాయి. హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, నిర్మాతలు ధీరజ్ మొగిల్నేని, ఎస్‌కేఎన్ తమ అనుభవాలను పంచుకుంటూ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ.. తన జీవితంలో ఇది ఎంతో ప్రత్యేకమైన విజయమని చెప్పారు. సినిమా విడుదలైనప్పటి నుంచి తన ఫోన్ నిరంతరం మోగుతూనే ఉందని, చాలామంది మీ అమ్మ ఉండి ఉంటే చాలా సంతోషించేదని చెబుతున్నారని వెల్లడించారు. అయితే తన అమ్మ ఎక్కడ ఉన్నా తన విజయాన్ని చూస్తూనే ఉంటుందని తాను నమ్ముతున్నానని ఆమె ఎమోషన్ అయ్యారు. ఒక తెలుగు అమ్మాయిగా కంటెంట్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు.నిర్మాత ధీరజ్ మొగిల్నేని మాట్లాడుతూ.. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం కూడా చిత్రానికి మరో బలమైందన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల మహిళలు సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారని వెల్లడించారు. గౌరీ ప్రియ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించిందని, అందుకే ఇప్పుడు ఆమెకు అంతటి ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. హీరో కిరణ్ అబ్బవరాన్ని నిజమైన నిర్మాతల హీరోగా అభివర్ణిస్తూ, షూటింగ్ విషయంలో ఎప్పుడూ సహకరించారని వెల్లడించారు.




# సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్



కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్–త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# అర్థవంతమైన పాత్రలుంటేనే చేస్తా: నిధి అగర్వాల్



సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్–2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma